క్లుప్తంగా

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రీడా సామగ్రిని అందజేస్తున్న తోట సుబ్బారావు

ప్రకాశం నగర్: చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోట సుబ్బారావు అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గౌతమ ఘాట్ వద్ద ప్రత్తిపాడు నియోజకవర్గం ఉత్తరకంచి గ్రామానికి చెందిన యువకులకు వాలీబాల్, ఫుట్‌బాల్, షటిల్ క్రీడా సామగ్రిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో లోడ శ్రీను, గుడాల వెంకట్రాజు, బక్కిన భాను, గుడాల సురేష్ పాల్గొన్నారు.

సంహితలో క్యాంపస్ డ్రైవ్



కార్యక్రమానికి హాజరైన దివీస్ ప్రతినిధులు

కంబాలచెరువు: తాడితోట జంక్షన్‌లోని సంహిత డిగ్రీ కళాశాలలో శుక్రవారం దివీస్ ల్యాబోరేటరీ లిమిటెడ్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించిందని కళాశాల ప్రిన్సిపల్ టి.రామకృష్ణ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు 115 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 60 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. కళాశాల ఏవో జి.బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ, ఉద్యోగాలు సాధిస్తూ కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టీఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

ఎంఈవో లజపతిరాయ్‌కి సత్కారం



ఎంఈవోను సత్కరిస్తున్న సమితి సభ్యులు

కడియం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అవార్డు అందుకున్న ఎంఈవో వి.లజపతిరాయ్‌ని శుక్రవారం స్థానిక చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళా సేవాసమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఎంఆర్‌సీలో కార్యక్రమం నిర్వహించారు. సమితి సభ్యులు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

50 గ్రాముల బంగారం చోరీ

కంబాలచెరువు: స్థానిక కంబాలపేటలోని ఎం.నాగేంద్ర ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు 50 గ్రాముల బంగారం చోరీ చేశారు. దీనిపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. నాగేంద్ర, అతడి భార్య గురువారం డ్యూటీకి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి చేరే సరికి తలుపులు తెరచి ఉన్నాయి. వెంటనే లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు నగలు కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్ ఇండియాతో ఆరోగ్యం

గోకవరం: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి సీహెచ్ఓ మేరీకృప, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు అన్నారు. కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం వైద్య సిబ్బంది ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేశారు. యోగా సాధన చేస్తూ ఆరోగ్యం కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతాయని తెలిపారు.

సారా కేసులో వ్యక్తికి రిమాండ్

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలోని శెట్టిబలిజపేటలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. గ్రామానికి చెందిన పితాని వీర వెంకట సత్యనారాయణ పది లీటర్ల సారా కలిగి ఉండటంతో అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు సారా సరఫరా చేస్తున్న ముకుందవరానికి చెందిన పత్తి ఏసుపై కేసు నమోదు చేశామన్నారు. పితాని వీర వెంకట సత్యనారాయణను పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించారన్నారు. దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై శేఖర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ లింక్ తప్పనిసరి

సీతానగరం: విద్యుత్ సర్వీసులకు ఆధార్ నంబర్ లింక్ తప్పనిసరి అని రాజమహేంద్రవరం రూరల్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దొడ్ల శ్రీధర్ వర్మ స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం మిర్తిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. మిర్తిపాడు, ఉండేశ్వరపురంలోని చేయూత లబ్ధిదారులకు సంబంధించిన సర్వేలో పాల్గొన్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. విద్యుత్ సంబంధిత అంశాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు.

సిరుల తల్లికి ప్రణమిల్లి

- ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



దేవీచౌక్‌లో కొలువుదీరిన బాలాత్రిపుర సుందరీ అమ్మవారు

సీటీఆర్ఐ: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మహిళలు ఉదయాన్నే గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. తమ ఇళ్లలో అమ్మవారికి వ్రతాలు చేసుకున్నారు. అనంతరం ఆలయాలను దర్శించారు. నగరంలోని మహాలక్ష్మి ఆలయాలలో కుంకుమ పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. దేవీచౌక్‌లోని బాలా త్రిపుర సుందరీ దేవి, గోదావరి గట్టున గల శ్రీశృంగేరి జగద్గురు శారద పీఠం, శంకరమఠంలో విశేష పూజలు జరిగాయి. వంకాయలవారి వీధిలోని వరలక్ష్మి, అష్టలక్ష్మి దేవాలయాలు ముస్తాబు చేశారు. గాడాలలోని గుడ్లగూబ సమేత మహాలక్ష్మీ దేవీ ఆలయం ప్రత్యేక శోభను సంతరించుకుంది. మహాలక్ష్మీ అమ్మవారికి శుక్రవారం 1,008 సమస్ర కమల పుష్పాలతో, 45 వేల పారిజాత పుష్పాలతో అర్చన చేశారు. లాలా చెరువు రోడ్డులోని గోవింద క్షేత్రంలో అమ్మవారికి హోమం, అభిషేకాలు నిర్వహించారు. ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారికి గాజుల అలంకరణ చేశారు. పుష్కర, వీఐపీ, సరస్వతి, కోటిలింగాల ఘాట్లకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కడియం: మండలంలోని అన్ని ప్రముఖ ఆలయాల్లోనూ విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వరాలయంలో అమ్మవారిని పెద్ద ఎత్తున మహిళలు దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. కడియం, వేమగిరి, దుళ్ల, జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, వీరవరం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు.



గాజుల ప్రత్యేకాలంకరణలో అపర్ణాదేవి

టీటీడీ ఆధ్వర్యంలో..

ప్రకాశం నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, జిల్లా ధార్మిక మండలి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక జైలు క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. టీటీడీ ధార్మిక కమిటీ సభ్యుడు కాలెపు సతీష్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచారంలో భాగంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అమ్మఒడి సేవ తరంగిణి కార్యదర్శి అలకాని శివ స్వామి, ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజు, ధార్మిక కమిటీ సభ్యులు సతీష్,.విజయదుర్గ పాల్గొన్నారు.



ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో పార్వతీమాతకు గాజుల అలంకరణ



గాడాలలో వేంచేసిన మహాలక్ష్మీ అమ్మవారు

బహిరంగ మద్యపానంపై కేసులు

కడియం: మండలంలోని వేమగిరిలో గల విందు దాబాపై ఎస్ఈబీ పోలీస్‌లు దాడులు చేసి, అక్కడ అనుమతి లేకుండా మద్యం తాగుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. అలాగే దివాన్‌చెరువు, ఆటో నగర్‌లోని దాబాలపై కూడా నిర్వహించిన దాడుల్లో పలువురిపై కేసులు నమోదు చేసి, ఆయా పోలీసు స్టేషన్లకు అప్పగించామన్నారు. దాబాల్లో అనుమతి లేకుండా మద్యం తాగితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

30 నుంచి సీపీఎం సమర భేరి

ప్రకాశం నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సీపీఎ ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకూ సమరభేరి కార్యక్రమంలో భాగంగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. శుక్రవారం స్థానిక శ్యామల సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు బి.రాజులోవ, నాయకులు ఎస్.మూర్తి, రాంబాబు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు సంతోష్ నగర్‌కు చెందిన పెద్దపల్లి చిన్నారిని అరెస్టు చేసి, పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. నిందితుడిని రిమాండ్ కోసం కోర్టులో హాజరుపరిచామన్నారు.

ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి కృషి

- విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
- కమిషనర్ దినేష్ కుమార్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

మధురపూడి: ఆరోగ్యకర సమాజం నిర్మాణానికి ఫార్మసీ విద్యార్థులు కృషి చేయాలని రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలోని కేజేఆర్ ఫార్మసీ కాలేజీ 20వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్షణాలతో పాటు, సామాజిక బాధ్యతను గుర్తెరిగి నడుచుకోవాలన్నారు. కేజేఆర్ ఫార్మసీ కాలేజీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. కాలేజీ చైర్మన్ డాక్టర్ డానియేల్ రవీంద్ర సుందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చదువులో ప్రతిభ చూపిన 12 మంది విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన 85 మందికి మెమెంటోలు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థినుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చందన్ కుమార్ బ్రహ్మ, వైస్ ప్రిన్సిపల్ భాను సుధ, హెచ్ఓడీ డాక్టర్ అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకూ రైట్‌రైట్

- ఆర్టీసీ బస్సుల రాకపోకలు
- ప్రయాణికుల హర్షం



మారుమూల గ్రామాలకు నడుస్తున్న ఆర్టీసీ బస్సు

మధురపూడి: మారుమూల పల్లెలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించడంతో గ్రామీణవాసుల ప్రయాణాలు సులభతరంగా, సురక్షితంగా జరుగుతున్నాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కోరుకొండ, గోకవరం మండలాల్లో పలు మారుమూల గ్రామాలున్నాయి. వీటిలో బుచ్చెంపేట, గుమ్ములూరు, మధురపూడి, నిడిగట్ల, గాదరాడ, కణుపూరు, గరగలంపాలెం అచ్యుతాపురం, గోపాలపురం, తిరుమలాయపాలెం, యర్రంపాలెం తదితర గ్రామాలు ఉన్నాయి. వీటికి కొంతకాలంగా బస్సు సర్వీసులు తిరగడం లేదు. ప్రజలందరూ ఆటోలపై ఆధారపడుతున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఎమ్మెల్యే రాజా చొరవతో..

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఇటీవల రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మారుమూల ప్రాంతాలకు బస్సులు తిరగక, ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారులకు వివరించారు. ఆ నేపథ్యంలో గోకవరం ఆర్టీసీ డిపో అధికారులు మారుమూల గ్రామాలకు బస్సులను పునరుద్ధరించారు. ప్రస్తుతం గోకవరం – గోపాలపురం, గోకవరం – బుచ్చెంపేట, గోకవరం – మధురపూడి, గోకవరం – కలవచర్ల వయా గాదరాడకు బస్సులు తిరుగుతున్నాయి. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాజమహేంద్రవరం విమానాశ్రయానికి ఉదయం 8.20, సాయంత్రం 5.20 గంటలకు బస్సులు తిప్పుతున్నారు. విమాన ప్రయాణికులు తక్కువ ఖర్చుతో రాజమహేంద్రవరం సురక్షితంగా చేరుతున్నారు. బుచ్చెంపేటకు బస్సు పునరుద్ధరణలో సచివాలయం కనీ్వనర్ మద్దాల చంటిబాబు, ఎస్సీసెల్ కార్యదర్శి జొన్నకూటి నాని పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

కంబాలచెరువు: వైద్య, ఆరోగ్య శాఖలో ల్యాబ్ టెక్నీషియన్లకు పదోన్నతులు కల్పించాలని ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ రాష్ట్ర సంఘం అధ్యక్షులు పి.రఘుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సర్వీసులో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2గా నియమితులై, ఒక్క పదోన్నతి కూడా పొందకుండానే అదే క్యాడర్‌లో ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు. తమ క్యాడర్ కు గ్రేడ్ 1, ల్యాబ్ సూపర్ వైజర్లుగా పదోన్నతులుగా కల్పించాలన్నారు. కరోనా పరీక్షలు నిర్వహించడంలో మన రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామన్నారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- అందరి అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం
- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్



సింహాచల నగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

ప్రకాశం నగర్: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ మద్దతు తెలిపి, మరోసారి సీఎం చేయాలని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక 49వ డివిజన్ సింహాచల నగర్ డీ, సీ బ్లాక్‌లలో గౌతమీ జీవ కారుణ్య సంఘం చైర్మన్, డివిజన్ ఇన్‌చార్జి బర్రే కొండబాబు ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. స్థానిక నాయకుడు రమేష్.. గూడూరి శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించారు. డివిజన్‌లో ప్రధానంగా రేషన్ సక్రమంగా అందడం లేదని పలువురు స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఎంఎస్ఓతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను అక్కడికక్కడే పరిష్కరించారు. స్థానికులు తెలిపిన ఇళ్ల పట్టాల సమస్యను సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులపై విద్యార్థుల అభిప్రాయం తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, గారా చంటిబాబు, తిరగటి దుర్గ, గణేష్, పులి సూరిబాబు, నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హీరో గ్లామర్ విడుదల



మోటారు సైకిళ్లను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న నగర ప్రముఖులు

ప్రకాశం నగర్: హీరో గ్రూపు ఆధునిక హంగులతో రూపొందించిన కొత్త గ్లామర్ మోటారు సైకిల్‌ను శుక్రవారం మార్కెట్లోకి విడుదల చేసింది. గ్లామర్ సింప్లీ మాగ్నెటిక్ పేరుతో రూపొందించిన ఈ మోటారు సైకిల్‌ను ఇండియన్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డీఎస్ఎస్ భారతి శుక్రవారం ఇన్నీసుపేటలోని సీపీ రెడ్డి హీరో మోటర్ కార్ప్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఎం.జితేంద్ర, స్వర్ణాంధ్ర నిర్వాహకులు గుబ్బల రాంబాబు హాజరయ్యారు. సంస్థ అధినేత సీపీ రెడ్డి మాట్లాడుతూ హీరో టూ వీలర్ వాహనాలలో గ్లామర్‌కు ఎంతో ఆదరణ ఉందన్నారు. దీన్ని కొత్త హంగులతో పాత మోడల్‌ను తిరిగి ప్రవేశపెట్టారన్నారు. యూఎస్బీ చార్జింగ్, ట్యూబ్ లెస్ టైర్లు, రియల్ టైం మైలేజ్ ఇండికేటర్, ఫుల్ డిజిటల్ కన్సోల్‌తో ఆకర్షణీయంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీ రెడ్డి అధినేతలు చింతా ప్రభాకర్ రెడ్డి, సంజీవరెడ్డి, నగర ప్రముఖులు ధర్మారెడ్డి నాగిరెడ్డి పాల్గొన్నారు.

పౌర సేవలు సమర్థంగా అందజేయాలి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ: రెవెన్యూ అనుబంధ ప్రభుత్వ కార్యక్రమాలు, పౌర సేవలు అందించే సామర్థ్యం మరింత పెంచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ పేర్కొన్నారు. రెవెన్యూ, స్వమిత్వ, ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణ, సేవలు – మ్యూటేషన్, ధాన్యం సేకరణపై డీఆర్వోతో కలిసి శుక్రవారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ స్వమిత్వ కింద 12 గ్రామాలకు చెందిన భూహక్కుదారులకు 3,082 పత్రాలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకూ 2,604 అందజేశారని, మిగిలిన వాటిని నెలాఖరులోగా పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో 1,181.835 ఎకరాలకు సంబంధించి 1,718 మంది క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇంకా 175 దరఖాస్తులను పరిశీలించాల్సి ఉందన్నారు. మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్ కోసం 106 స్థలాలు గుర్తించాల్సి ఉండగా 85 చోట్ల గుర్తించామని, మిగిలిన 21 చోట్ల కూడా అనువైన ప్రాంతం గుర్తించి సేకరణ చేపట్టాలని ఆదేశించారు. నీటి తీరువా వసూలును వేగవంతం చేయాలన్నారు. మ్యూటేషన్‌కు 3,583 దరఖాస్తులు వచ్చాయని, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి త్వరితగతన పరిష్కారం చూపాలన్నారు.

నేడు కోరుకొండకు అన్నవరం సత్యరథం

మధురపూడి: అన్నవరం వీర వెంకట సత్యనారాయణస్వామి వారి సత్యరథం శనివారం కోరుకొండ వస్తోందని అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు తాడి రజనీరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. అన్నవరంలో సత్యరథంలో బయలుదేరిన స్వామివారు శనివారం మధ్యాహ్నానికి ఇక్కడకు చేరుకుంటారు. స్వామివారికి భక్తులు స్థానిక కాపవరంలోని రాజరాజేశ్వరి ఆలయం వద్ద స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి కోరుకొండ మెయిన్ రోడ్డు, బస్టాండ్ సెంటర్ మీదుగా లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి రథం చేరుకుంటుంది. భక్తుల దర్శనం అనంతరం పశ్చిమగానుగూడెం మీదుగా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామానికి వెళుతుంది. అక్కడి నుంచి ఏజెన్సీకి పయనమవుతుంది.

ప్లాస్టిక్ వ్యర్థాలు.. అనేక అనర్థాలు

- పెరిగిపోతున్న వినియోగం
- పేరుకుపోతున్న చెత్త
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ వేత్తలు



కడియంలో చెత్తతో కలిపి భారీగా పోగైన ప్లాస్టిక్ వ్యర్థాలు

కడియం: బయటకు వెళ్లితే కాళ్లు కడుక్కుని ఇంట్లోకి వచ్చే మనం.. కాలుష్యాన్ని మాత్రం స్వయంగా ఇంట్లోకే కొనుక్కుని తెచ్చేసుకుంటున్నాం. చిన్నపాటి అశ్రద్ధ కారణంగా ప్రతి రోజూ పదుల సంఖ్యలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వాడుతూ, అటు పర్యావరణానికి అంతిమంగా మానవ ఆరోగ్యానికి ముప్పు తెచ్చుకుంటున్నాం. గుడ్డతో తయారు చేసిన చేతి సంచిని వినియోగిస్తే ఒక కుటుంబం రోజుకు పదికి పైగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని తగ్గించవచ్చని అంచనా. కానీ ఆ దిశగా ఎవ్వరూ ఆలోచించడం లేదు. దీంతో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. జనావాసాల నుంచి వచ్చే వ్యర్థాలతో కలిసి ఇవన్నీ గ్రామాల శివార్లకు, డంపింగ్‌యార్డులకు చేరుతున్నాయి. కొండల్లా పేరుకుపోతున్న వీటిని వదిలించుకునే క్రమంలో నిప్పుపెడుతున్నాయి. తీవ్రమైన వాతావరణ కాలుష్యం ఏర్పడి, చివరికి మన ఆరోగ్యానికి మనమే ముప్పు తెచ్చుకుంటున్నాం.

చర్యలు తీసుకుంటున్నా..

ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, అమలు చేయాల్సిన యంత్రాంగం మాత్రం నిర్లక్ష్యం చూపుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్ నిషేధం పల్లెలకు పూర్తి స్థాయిలో చేరకపోవడంతో పెద్ద ఎత్తున వినియోగం పెరిగిపోతోంది. కూరగాయలు, టిఫిన్లు, ఇతర ఆహార పదార్థాలు ఇళ్లకు తెచ్చుకోవడానికి, పాల ప్యాకెట్లు, డిస్పోజబుల్ గ్లాస్‌లు, ప్లేట్లు.. ఇలా ఉదయం నుంచి సాయంత్రం వరకు మనిషి ప్రతి అవసరంలోనూ ప్లాస్టిక్ వస్తువులనే వినియోగిస్తున్నారు.

రోజూ 50 టన్నుల చెత్త


నియోజకవర్గంలోని రూరల్, కడియం మండలాల్లోని గ్రామాల నుంచి నిత్యం సుమారు 50 టన్నుల వరకూ చెత్త పోగవుతుందని అంచనా. ఇందులో సుమారు 3 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. తడిచెత్త – పొడిచెత్త విధానం అమలులో కూడా అలసత్వ వహిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించుకునే రీతిలో చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు.

> **వినియోగం పెరిగింది**
>
> ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు ఇవ్వకపోవడంతో ఎవరికి వారు ఇంటి నుంచి చేతి సంచులను తెచ్చుకునేవారు. కొన్నాళ్లు ఇది బాగానే నడిచింది. ఆ తర్వాత మళ్లీ యథాప్రకారం ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగం పెరిగిపోయింది.
>
> పి.సత్యం, వ్యాపారి, కడియం

హెచ్చరికలు బేఖాతరు

ప్లాస్టిక్‌ను కాలిస్తే మరింత ప్రమాదమని హెచ్చరిస్తున్నప్పటికీ అన్ని రకాల చెత్తతో పాటే ప్లాస్టిక్‌ను కూడా తగలబెడుతున్నారు. ఈ ప్రక్రియతో విపరీతమైన వాయు కాలుష్యం ఏర్పడుతోంది. శ్వాస సంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడేవారి సంఖ్య పెరగడానికి ప్రధాన కారణాల్లో ముఖ్యమైంది ప్లాస్టిక్‌ను మండించడమేనని వైద్యులు కూడా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై ఎవరికి వారు అవగాహన పెంచుకోవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ తగులబెట్టకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలని, ఇందుకు సంబంధిత ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ చూపాలని కోరుతున్నారు.

సినిమాలు



శ్యామల	: బెదురులంక 2012
సూర్యమినీ	: డ్రీమ్‌గర్ల్–2
స్వామి	: భోళాశంకర్
శివజ్యోతి	: బెదురులంక 2012
అనుశ్రీ	: కింగ్ ఆఫ్ కొత్త
రాజా	: గాండీవధారి అర్జున
అశోక	: జైలర్
ఊర్వశి	: గాండీవధారి అర్జున
రంభ	: బేబి
మేనక	: ఏం చేస్తున్నావ్, భూతాల బంగళా
అప్సర	: బాయ్స్‌హాస్టల్
నామవరం	
వీఎస్ మహల్	: గాండీవధారి అర్జున
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: గాండీవధారి అర్జున
కడియం	
వెంకటసూర్య	: గాండీవధారి అర్జున